మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటాలి

- వేడుకగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- మహిళలకు సత్కారం
- సందడి చేసిన మహిళలు, చిన్నారులు

సీఎస్‌పురం(పామూరు)/కనిగిరిరూరల్/పామూరు/హనుమంతునిపాడు: మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీలు, సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా ప్రజా ప్రతినిధులు, నేతల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని సభలు నిర్వహించి, వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పలుచోట్ల మహిళా నేతలకు, ప్రజా ప్రతినిధులకు, కార్మికులకు, సేవాతత్పరులకు సన్మానాలు జరిగాయి.

వైఎస్సార్ సీపీ మహిళా నేతల ఆధ్వర్యంలో..

వైఎస్సార్ సీపీ మహిళా నేతలు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ కనిగిరి మహిళా నేతలు, ప్రజా ప్రతినిధులు కలిసి పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాడు ఎంపీపీ గాయం సావిత్రి, కనిగిరి మున్సిపల్ వైస్ చైర్మన్, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు తమ్మినేని సుజాతరెడ్డి, దేవకి సత్యావతి, పసుపులేటి దీప, పార్టీ అంగన్ వాడీ విభాగం అధ్యక్షురాలు ఎం నాగమణి, పార్టీ నాయకులు భారతీ, షకీలా, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.


పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలిని సన్మానిస్తున్న కనిగిరి మహిళా నేతలు

మున్సిపల్ ఆఫీసులో..

మహిళా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ ఆఫీసులో మున్సిపల్ మహిళా కార్మికులను మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ మహిళా అభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎస్‌కే షఫీ జాస్మిన్, నాగూర్‌బీ, విజేత విద్యాసంస్థల అధినేత పి అరుణోధర్, మంద్రు రమేష్, రాజేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు చీరలు పంపిణీ..

వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం సంఘం మహిళా అధ్యక్షురాలు రామలక్ష్మీ అధ్యక్షతన దివ్యాంగ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘు రాష్ట్ర అధ్యక్షుడు ధూళిపాళ్ల మల్లికార్జునరావు, వైద్యులు రమేష్, హైమా, ఉపాధ్యాయులు సూరసాని మనీషా, సంగరాజు సాయి మనోజ్, గోనా దానయ్య, నాగేశ్వరరావు, వేముల మైనర్ బాబు తదితరులు పాల్గొన్నారు.


అరివేములలో మహిళా దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపట్టిన మహిళలు

యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగానిర్వహించారు. ఎస్ ఉమా మహేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు మహిళా నేతలు, నాయకులు మాట్లాడారు. మహిళలు తమ హక్కుల సాధనకు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. పలువురు మహిళా ఉపాధ్యాయినిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ జీ కరుణ కుమారి, ఉపాధ్యాయ మహిళా నేతలు ఇందిరా, అంజనీ దేవి, కే పద్మావతి, జీ స్వప్న, శ్రీధరమ్మ, బషీరున్నిసా, ఈశ్వరమ్మ, జాన్సీ, నాగమణి, ఉషారాణి, జుబేదా, కే ప్రసన్నా, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు మీగడ వెంకటేశ్వర రెడ్డి, వి మాలకొండారెడ్డి, ఎస్‌కే ఖాజారంతుల్లా, పట్నం నరసింహం,టీ రమణారెడ్డి, కే వెంకటేశ్వర్లు, రమేష్, ఏసుబాబు, ఎం రాము, బ్రహ్మయ్య, జిలానిబాష, బి మల్లికార్జున, పాతులూరయ్య తదితరులు పాల్గొన్నారు.

☛ కనిగిరిలో ఆర్య వైశ్య మహిళా విభాగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనమర్లపుడి లక్ష్మీమోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు నిర్వహించిన వివిధ రకాల పోటీలు ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్‌గఫార్, వాసవీ సత్ర సముదాయాల జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, జే లక్ష్మీ, జీ శిరీషా, సీహెచ్ హేమలత, పీ ప్రసన్న, విజయలక్ష్మీ, స్రవంతి, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు. సాయి కృష్ణా దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని దివ్యాంగులకు, మహిళలకు చీరలు, బాక్స్‌లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు దోసపాటి నరసయ్య రఫీ, తహసీన్, ఖాజా రంతుల్లా, మద్ది శెట్టి భారతీ, తదితరులు పాల్గొన్నారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ కే కరుణ కుమారి, డాక్టర్ బంకా అనురాధలు మాట్లాడారు. ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఎన్ శ్రీలత , ఎర్రయ్య, జీ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సీఎస్‌పురం మండలంలో..

సీఎస్‌పురం మండలంలోని అరివేములకు చెందిన ఆనందం నవమణి ట్రస్ట్ సీఏఓ డాక్టర్ పి.అల్బర్ట్ మ్యాథ్యూ ఆధ్వర్యంలో అన్నారు. మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.రాధారుక్మిణమ్మ, సంస్థ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

☛ హనుమంతునిపాడు మండలం కొండారెడ్డిపల్లి సచివాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సర్పంచ్ కలుకూరి దేవకరుణమ్మను సాల్వతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్యదర్శి షేక్ సకిలా మాట్లాడుతూ మన మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

☛ పామూరులోని కేజీబీవీలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం షేక్.మదారమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా జేవీవీ మండల కార్యదర్శి కాశీ శంకర్ మాట్లాడుతూ నేడు మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నా వారిపై హత్యలు, అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయని వీటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. మహిళలు తమ హక్కులు సాధించుకోవాలంటే ఉద్యమాలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు షేక్.రమీజా, కే.ధనలక్ష్మి,ఏఓ వాణి పాల్గొన్నారు.


కార్మికులను సన్మానిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్


కొండారెడ్డిపల్లిలో మహిళా సర్పంచ్ కరుణమ్మను సన్మానిస్తున్న కార్యదర్శి, మహిళలు


మాట్లాడుతున్న కనమర్లపుడి లక్ష్మీ మోహన్

సింగరాయకొండ :ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జయమణి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవోను మహిళలు ఘనంగా సత్కరించారు.

☛ జరుగుమల్లిలో ఏపీఎం డీ జయరాజ్ ఆధ్వర్యంలో ఐకేపీ కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు, సంఘ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఎన్ కామేశ్వరమ్మ, సెక్రటరీ ఎం దయామణి, వీఓఏలు, సీసీలు పాల్గొన్నారు.

జాతీయ మహిళా దినోత్సవంలో ఎంపీపీ..

ఒంగోలు: వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జాతీయ మహిళా దినోత్సవంలో మండల ఎంపీపీ గాయం సావిత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళా అన్ని రంగాల్లో పురోగమించాలని కోరుతూ అందరికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియ చేసినట్లు ఆమె తెలిపారు.


ఒంగోలులో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ సావిత్రి


కనిగిరిలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో మహిళా టీచర్లకు సన్మానం


కనిగిరిలో దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో చీరలు పంపిణీ


సింగరాయకొండలో ఎంపీడీవో జయమణిని సత్కరిస్తున్న అతిథులు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో తులసీదళార్చన


స్వామివార్లకు పట్టువస్త్రాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

పామూరు: మండల కేంద్రం పామూరు రుక్మిణి సత్యభామా సమేత మదన వేణుగోపాలస్వామివారి తులసీదళార్చన, అభిషేకోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం సత్యబాబుస్వామి ఆధ్వర్యంలో వేదమంత్రాలతో రుక్మిణి, సత్యభామ, మదన వేణుగోపాలస్వామివార్ల మూల విగ్రహమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం విశిష్ట అలంకరణగాంచి దాతుల సమకూర్చిన పట్టువస్త్రాలను స్వామివార్ల విగ్రహమూర్తులకు అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం మహానైవేద్యం సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. పూజా కైంకర్యాలను ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు పర్యవేక్షించగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బండ్లా నారాయణ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో 13వ వార్డులోని మున్సిపల్ ఆఫీసు వెనుక వీధిలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో రాజీ లేకుండా పనులు చేయాలని సూచించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



బహుమతులు పొందిన విద్యార్థులతో కరస్పాండెంట్ అపర్ణ

కొండపి: మానసిక, శరీరక దారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయని హ్యాపీ కిడ్స్ కరస్పాండెంట్ ప్రత్తిపాటి అపర్ణ అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని హ్యాపీ కిడ్స్ హైస్కూల్లో మహిళా దినోత్సవం సందర్భంగా అన్యువల్ స్పోర్ట్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. వివిధ క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, మెడల్స్ అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీఈటీ నాగరాజు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు: పట్టణంలోని బంగారమ్మ గుడి ప్రాంతంలో విద్యుత్‌లైన్ మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఆ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ టీవీ నరశింహం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ వీఐపీ ఫీడర్ పరిధిలోని తూర్పువడ్డిపాలెం , తూర్పుకమ్మపాలెం, తూర్పుసాలిపాలెం, మారెమ్మమిట్ట, బూడిదపాలెం, లింగయ్య నాయుడు ఇంటి ప్రాంతం, కోటారెడ్డినగర్, హోండా షోరూం, ఆదియేంద్ర కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని, విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

పాలనలో కూటమి ప్రభుత్వం విఫలం


ఇంటింటికి వెళ్లి సమస్యలపై చర్చిస్తున్న నాయకులు

పామూరు: ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై పాలకులు, అధికారులు దృష్టిసారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హనీఫ్ అన్నారు. శనివారం స్థానిక సమస్యలపై ప్రజాచైతన్యయాత్రలో భాగంగా స్థానిక ఛత్రపతి శివాజీ నగర్, సీఎస్‌పురం రోడ్డు పలు ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి తాగునీరు, అంతర్గతరోడ్లు, మరుగుదొడ్లు, ప్రభుత్వ పథకాలు, పారిశుధ్యం, నూతన రేషన్‌కార్డులు, నివేశనాస్థలాలు, పెన్షన్లు మొదలైన సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 మాసాలు దాటుతున్నా నేటికి నూతన రేషన్ కార్డులు, నివేశన స్థలాలు ఇచ్చిన దాకలాలు లేవన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కొమ్మలపాటి మాల్యాద్రి, మండల కార్యదర్శి ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 227 కేసుల పరిష్కారం

కనిగిరిరూరల్: జాతీయ లోక్ అదాలత్ లో 227 కేసులు పరిష్కారమైనట్లు న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కే భరత్ చంద్ర తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జడ్జి కే భరత్‌చంద్ర మాట్లాడుతూ క్రిమినల్ కేసులు 72, భరణం కేసులు 4, ఎస్టీసీ 151 ఇరువర్గాల వారిని రాజీ కుదిర్చి పరిష్కరించినట్లు తెలిపారు. కక్ష్యలు, కార్పణ్యాలకు వెళ్లకుండా రాజీ మార్గంలో వెళ్లి రాజమార్గాన్ని అనుసరించాలన్నారు. రాజీ మార్గమే రాజమార్గంగా తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక కోర్టు ప్రాంగణంలో మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీస్ చట్టం (నల్సా) ప్రకారం న్యాయ సేవాధికార సంస్థల ద్వార ఉచిత మహిళలకు ఉచిత న్యాయసహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయసేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, న్యాయసేవాధికార సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి భరత్ చంద్ర

ఉన్నత లక్ష్యం ఉంటే భవిష్యత్ బంగారం


మాట్లాడుతున్న ఎంఈఓ జీ సంజీవి

కనిగిరిరూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగినప్పుడే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎంఈఓలు యూవీ నారాయణరెడ్డి, ఆర్ శ్రీనివాసులు, జీ సంజీవి, దేవిరెడ్డి రామిరెడ్డి, రాజాలకొండా రెడ్డిలు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవం, పది విద్యార్థుల వీడ్కోలు సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని .. క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో చింతలపాలెం హెచ్‌ఎం రామశర్మ, ఉపాధ్యాయులు పల్లా కోటిరత్నం, టీఎస్ పద్మజా రాణి, ఆర్ నరసింహారావు, కే బాలచందర్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మహిళా దినోత్సవం పురస్కరించుకుని పాఠశాలలోని మహిళా టీచర్లను ఘనంగా సన్మానించారు.

23 కేసులు పరిష్కారం

సింగరాయకొండ: లోక్ అదాలత్ కోర్టులో శనివారం మధ్యం పట్టుకున్న కేసులు 23 పరిష్కారం అయినట్లు ఎక్సైజ్ సీఐ ఎం శివకుమారి తెలిపారు. ఈ కేసుల పరిష్కారం కోసం రూ.1.64 లక్షలు ప్రభుత్వానికి జరిమానాగా ప్రభుత్వానికి నగదు చెల్లించినట్లు ఆమె వివరించారు.


ఎం శివకుమారి, ఎక్సైజ్ సీఐ

అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మద్దిపూడి: పృథులగిరి లక్ష్మీనృసింహ్మస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. మద్దిపూడి శివాలయంలో ఉన్న లక్ష్మీ నృసింహ్మస్వామి ప్రతిమలను ఆలయ అర్చకులు నారాయణం మారుతీచార్యులు పూల మాలలతో ప్రత్యేకంగా అలంకరించి పల్లకిపై ఉంచారు. స్వాములవారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో మేళతాళాలతో ఘనంగా ఊరేగించుకుంటూ పృథులగిరి కొండపైకి తీసుకెళ్లారు. పృథులగిరిపై ఉన్న ఆలయంలో అభిషేకం నిర్వహించి, వేదమంత్రోచ్చరణల మధ్య అంకురార్పణ జరిగింది. నేలబొట్ల లక్ష్మీ నరసింహశాస్త్రి కుమారుడు లక్ష్మీ సత్యన్నారాయణ ఉభయదాతలుగా వ్యవహరించారు. నారాయణం వికనస ఆచార్యులు, నారాయణం ఆదిశేషాచార్యులు, నారాయణం రమణాచార్యులు కార్యనిర్వహణాధికారి ఎన్ నారాయణరెడ్డి, కాటూరి ప్రసాదులు పాల్గొన్నారు.


లక్ష్మీ నృసింహస్వామిని ట్రాక్టర్‌పై ఊరేగిస్తున్న భక్తులు

రేపటి నుంచి ప్రారంభం కానున్న పొగాకు వేలం

కొండపి: రేపటి నుంచి కొండపి బోర్డులో పొగాకు వేలం నిర్వహిస్తున్నట్లు వేలం నిర్వహణ అధికారి జి సునీల్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక వేలం కేంద్రంలో పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024–25 సీజన్‌కు సంబంధించి పొగాకు వేలం సోమవారం నుంచి ప్రారంభిస్తున్నామని అన్నారు. బోర్డు పరిధిలో 13 క్లస్టర్లలో 45 గ్రామాలు ఉండగా రైతుల 3974 మంది ఉన్నారు. అనుమతి పొందిన బ్యారెన్లు 2846 ఉన్నాయని తెలిపారు. ఈసీజన్‌కు సంబంధించి 7733 హెక్టార్లకు అనుమతినివ్వగా 10369 హెక్టార్లలో రైతులు పంట సాగు చేశారు. బోర్డు పరిధిలో 12 మిలియన్ల కేజీలకు అనుమతినివ్వగా రైతులు 18.38 మిలియన్ల కేజీల పంట పండించారు. అనుమతించిన మేర అదనంగా 6.38 మిలియన్ల కేజీల పంటను పండించారని తెలిపారు. 2023–24 సీజన్లో పొగాకు రికార్డు ధర పలికిందని అన్నారు. పొగాకు గరిష్ట ధర రూ.362 అని కనిష్ట ధర రూ.49 పలికిందని, సరాసరి ధర రూ.269.98 పలికిందన్నారు. మొత్తం 164 రోజులు వేలం నిర్వహించామని ఆయన తెలిపారు.

వైభవంగా క్షీర, జలాధివాసములు


విశిష్ట అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని శీలంవారిపల్లెలో నూతన ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టామహోత్సవంలో భాగంగా మూడో రోజు శనివారం రుత్వికులు వేదమంత్రాలతో క్షీరాదివాసం, జలాధివాసం, శయనాదివాసములు నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ విడుగు విజయబాబూరావు ఆధ్వర్యంలో ప్రతిష్టామూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ అందజేశారు.

సర్వే చేసుకో..జీతం తీసుకో!

- సర్వే పేరుతో వేధిస్తున్న కూటమి ప్రభుత్వం
- ఒత్తిడి చేస్తున్న అధికారులు
- పాకల–1, 2, ఊళ్లపాలెం సచివాలయాల ఉద్యోగులకు రాని జీతం
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు

సింగరాయకొండ: సచివాలయాల ఉద్యోగుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కూటమి ప్రభుత్వం రాకతో వారినిమీద పనిభారం వేసి గొడ్డు చాకిరీ చేయించుకుంటోంది. మండలంలో ప్రస్తుతం సర్వే చేసుకో.. జీతం పుచ్చుకో అన్న విషయం గ్రామ సచివాలయ ఉద్యోగులలో ట్రెండింగ్‌గా మారింది. ప్రస్తుతం ప్రభుత్వం గ్రామ సచివాలయ ఉద్యోగులపై మెడపై కత్తి పెట్టి మరీ సర్వేలు చేయిస్తోంది. దీంతో సచివాలయ ఉద్యోగులు నిద్రలేని రాత్రులు అనుభవిస్తున్నామని పేరు చెప్పుకోలేని ఒక సచివాలయ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తెల్లవారితే చాలు ఏ అధికారి నుంచి ఫోన్ వస్తుందోనని టెన్షన్ పడుతున్నామని చివరికి బీపీలు, షుగర్‌లు కూడా వచ్చాయని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్వే చేయకపోతే జీతాలు ఆపేస్తాం..

ప్రస్తుతం గ్రామాల్లో తమ మాతృశాఖ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తూ ఇతర సర్వేలు కూడా చేస్తున్నామన్నారు. ప్రస్తుతం గ్రామంలో ఎంఎస్‌ఎంఈ సర్వే, వర్క్ ఫ్రం హోమ్ సర్వే, పీ–4 సర్వే, చైల్డ్ వితౌట్ ఆధార్ సర్వే చేస్తున్నామన్నారు. దీంతో తాము మా మాతృశాఖ అధికారి చెప్పే పనులతో పాటు ఎంపీడీవో, తహశీల్దార్, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో జరిగే సర్వేలు కూడా చేయాల్సిన దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రాత్రింబవళ్లు తేడా లేకుండా సర్వే చేస్తున్నామని మళ్లీ ఒకటో తేదీనే రాగానే ఫించన్ పంపిణీ కూడా చేయాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం ఉన్న సర్వేలలో ఏ ఒక్క సర్వేలో వెనకబడినా సంబంధిత అధికారి చేత చీవాట్లు తినాల్సి వస్తుందని, మాపై ఉన్నట్లు మా పై అధికారుల మీద కూడా ఒత్తిడి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాని మేము కూడా మనుషులమేనని ఒక వ్యక్తి ఒకే సమయంలో మూడు రకాల పనులు ఎలా చేయగలడని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా చచ్చీ చెడీ పనిచేస్తుంటే మీ పనితీరు బాగా లేదని సర్వేలు సక్రమంగా చేయలేదని ఇలాగైతే మీ జీతాలు ఆపుతామని మండలాధికారులు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



08 కేడీపీ 500 సచివాలయం..

ఈనెల జీతాలు రాలా.. ?

మండలంలోని పాకల–1, 2, ఊళ్లపాలెం గ్రామ సచివాలయ సిబ్బంది సర్వేలు సక్రమంగా చేయలేదని ఈనెల జీతాల బిల్లులు పెట్టకపోవటంతో ఈ మూడు సచివాలయ సిబ్బందికి జీతాలు రాని పరిస్థితి నెలకొంది. మండలంలో 10 గ్రామాలకు గాను 15 గ్రామ సచివాలయాలు ఉండగా మిగిలిన గ్రామ సచివాలయ సిబ్బందికి రాగా పైమూడు గ్రామ సచివాలయ సిబ్బందికి మాత్రం ఈనెల జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక పక్క పెరిగిన నిత్యావసర ధరలు, సకాలంలో కట్టాల్సిన ఈఎంఐలు, కుటుంబ సభ్యుల వైద్య ఖర్చులు వెరసి మాకు నిద్రలేని రాత్రులే మిగిలుతున్నాయని వాపోతున్నారు. ఈ విధంగా జీతాలు సకాలంలో ఇవ్వకపోతే ఎలా బతకాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ మూడు సచివాలయాలకు 6న గాని 7వ తేదీ కాని జీతాల బిల్లు పెడతామని చెప్తున్నారని, ఇలాగైతే ఏ 15వ తేదీ, 20వ తేదీ జీతాలు వస్తాయని దీంతో ఈఎంఐలకు వేలాది రూపాయల జరిమానా చెల్లించుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి ప్రతినెల జీతాలు సకాలంలో వచ్చేలా చర్యలు తీసుకుని తమను ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామ సచివాలయ సిబ్బంది అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.